www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 12 డిసెంబర్ 2023 | 5 | పశ్చిమ గోదావరి

నేడు గాలాయగూడెంలో గవర్నర్ పర్యటన

వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు హాజరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం ఏలూరు జిల్లా దెందులూరు మండలం గాలాయగూడెంలో పర్యటించనున్నారు. ఉదయం 9.15 గంటలకు రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరి 10.50 గంటలకు గాలాయిగూడెం చేరుకుంటారు. 11 గంటల నుంచి 12.40 గంటల వరకూ వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారు. అనంతరం 12.45 గంటలకు గాలాయిగూడెం నుంచి తిరిగి రాజభవన్‌కు బయలుదేరతారు. గవర్నర్ పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

'కొల్లేరు'కు వరద..!



అగమ్యగోచరంగా కొల్లేరు ప్రాంత గ్రామాల్లో దాళ్వా సాగు

పలు మండలాల్లో వేలాది ఎకరాల సాగుపై అయోమయం

ముంపుబారిన ఇప్పటికే వేసిన నారుమడులు

మళ్లీ నారుమడులు వేయాల్సిన పరిస్థితి

డిసెంబర్ నెలాఖరుకు నారుమడుల పూర్తి అనుమానమే

సన్న, చిన్నకారు రైతుల పొలాలన్నీ కొల్లేరుకు ఆనుకునే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరుకు ఆనుకుని ఉన్న గ్రామాల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మిచౌంగ్ తుపానుతో కురిసిన భారీ వర్షాల వల్ల కొల్లేరుకు వరదనీరు పోటెత్తడంతో దాళ్వాసాగుపై రైతుల్లో ఆందోళన నెలకొంది. రోజురోజుకీ వరద నీరు పెరగడంతో ఇప్పటికే వేసిన నారుమడులన్నీ ముంపునకు గురయ్యాయి. నారుమడులను వరద నీటి నుంచి కాపాడుకునే అవకాశం లేకపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కొల్లేరుకు ఆనుకుని నిడమర్రు, ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు, కైకలూరు, ఆకివీడు వంటి మండలాలు ఉన్నాయి. ఈ మండలాలకు చెందిన పలు గ్రామాలకు చెందిన పొలాలు కొల్లేరుకు ఆనుకుని ఉన్నాయి. ఐదో కాంటూరుకు పైన పట్టాభూములతోపాటు అనసరి భూములు ఉన్నాయి. ఈ మండలాల్లో దాదాపు నాలుగైదు వేల ఎకరాలకుపైగా భూముల్లో రైతులు దాళ్వాలో వరిసాగు చేస్తుంటారు. వర్షాలు, వరదల కారణంగా కొల్లేరుకు ఆనుకుని ఉన్న భూముల్లో రైతులు ఖరీఫ్ పంట సాగు చేయరు. దాళ్వా మాత్రమే సాగు చేస్తారు. దీంతో ఇప్పటికే నిడమర్రు మండలం అడవికొలనుతోపాటు పలు గ్రామాలకు చెందిన రైతులు దాళ్వా నారుమడులు వేయడం జరిగింది. తుపాను దెబ్బకు కొల్లేరుకు వరద నీరు పోటెత్తడంతో నారుమడులన్నీ మునిగిపోయాయి. ఎకరాకు రూ.రెండు వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. వరద పోటు ఇప్పటికీ తగ్గకపోవడంతో దాళ్వా సాగుపై అయోమయం నెలకొంది. రెండోసారి నారుమడులు వేస్తే తప్ప దాళ్వాసాగు చేసేందుకు వీల్లేని పరిస్థితి నెలకొంది. కొల్లేరుకు ఆనుకుని ఉన్న పొలాలన్నీ సన్న, చిన్నకారు రైతులకు సంబంధించినవే 80 శాతం ఉన్నాయి. దాళ్వా సాగు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. మళ్లీ దాళ్వా వరకూ సాగు చేసుకునే అవకాశం ఉండదు. దీంతో రైతులకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

నెలాఖరుకు నారుమడులు పూర్తయ్యేనా..!

చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వరద నీరంతా కొల్లేరులోకి ప్రవేశిస్తోంది. దీంతో కొల్లేరుకు వరదనీరు రోజురోజుకు పెరుగుతూనే ఉంది. కొల్లేరు పొలాల్లో నడుము లోతు వరకూ వరద నీరు చేరినట్లు రైతులు చెబుతున్నారు. డిసెంబర్ నెలాఖరుకు కూడా నారుమడులు పూర్తవుతాయో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. అదే జరిగితే దాళ్వా పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఈ నెలాఖరుకు నారుమడులు పూర్తయితే ఫిబ్రవరి 15వ తేదీ వరకూ నాట్లు వేయాల్సి ఉంటుంది. ఇంకా నారుమడులు ఆలస్యమైతే నాట్లు మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. అప్పుడు మే నెలాఖరుకు పంట చివరిదశకు చేరుకుంటుంది. అప్పుడు అకాల వర్షాలు, తీవ్రమైన ఎండలు రైతులను వెంటాడనున్నాయి. అంతేకాకుండా నాట్లు ఆలస్యమైతే దిగుబడి సైతం తగ్గే పరిస్థితి ఏర్పడనుంది. దీంతో కొల్లేరుకు ఆనుకుని ఉన్న గ్రామాల రైతుల పరిస్థితి అయోమయంగా మారింది.

కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తీస్తేనే నీరు తగ్గుముఖం

కొల్లేరులోకి వచ్చిన వరద నీరు త్వరితగతిన తగ్గాలంటే కాలువల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క వంటివి వెంటనే తొలగించాలి. కొల్లేరులోని కాలువలన్నింటిలోనూ తక్షణం బాగుచేత పనులు చేపట్టాలి. కాలువల్లో అడ్డంకులు తొలగితే వరదనీరు తగ్గి నారుమడులు త్వరగా వేసుకునే అవకాశం ఉంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ గురించి ఆలోచన చేయాలని కొల్లేరు రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

సకాలంలో అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

జెసి రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

సమస్యలు వింటున్న జెసి రామసుందర్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 'స్పందన'లో అందని అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన 'స్పందన'లో డిఆర్ఒ బి.శ్రీమన్నారాయణరెడ్డి, డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ కానాల సంగీతమాధుర్, వార్డు, గ్రామ సచివాలయ జిల్లా అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ వైఎన్ఎస్.ప్రసాద్, హౌసింగ్ పీడీ డాక్టర్ ఆర్‌సి.ఆనంద్‌కుమార్, డిఎస్‌పి బి.శ్రీనాథ్‌తో కలిసి ప్రజల నుండి 227 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు సమస్య పరిష్కారం కాలేదని తరచూ కార్యాలయం చుట్టూ తిరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలి

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై సంబంధిత అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో క్రీడాకారుల బృందాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవడంపై వీరవాసరం, ఇరగవరం ఎంపిడిఒలు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్లపై జెసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆటలకు ప్రతి సచివాలయ పరిధిలో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా రెండు బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి సచివాలయానికి సుమారు 400 చొప్పున ఆడియన్స్ రిజిస్ట్రేషన్ కూడా పూర్తి పూర్తి చేయాలని తెలిపారు. ఆటలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా క్రీడా మైదానాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీరాజ్ శాఖాధికారి జివికె.మల్లికార్జునరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ లా నేస్తంతో ఆర్థిక చేయూత

కొత్తగా న్యాయవాద వృత్తి చేపట్టిన జూనియర్ లాయర్లకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ లా నేస్తం పథకం ఆర్థిక చేయూతతోపాటు వృత్తిలో కొనసాగేందుకు మరింత ప్రోత్సాహాన్నిస్తోందని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. 2023-24 సంవత్సరానికి రెండో విడత 'వైఎస్ఆర్ లా నేస్తం' తాడేపల్లి నుండి సోమవారం ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ప్రత్యక్ష ప్రసారాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, వార్డు, గ్రామ సచివాలయాల జిల్లా అధికారి కెసిహెచ్.అప్పారావు, న్యాయవాదులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ యువ న్యాయవాదులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో వైఎస్ఆర్ లా నేస్తం ద్వారా గత మూడేళ్లుగా 192 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరిందన్నారు. ఈ ఏడాది జులై 2023 నుండి డిసెంబరు వరకు ఆరు నెలలు కాలానికి 192 మందికి రూ.30 వేలు చొప్పున రూ.57.60 లక్షలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కె.సుస్మిత షాలోమ్, కామాక్షి రవి, సిన్హా యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలి

సిపిఎం, ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన ఆందోళనలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మిచౌంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ భారీ వర్షాలు అన్ని పంటలకు నష్టం కల్గించాయన్నారు. వరి, శెనగ, పెసర, కంది, మొక్కజొన్న, మిరప, మినప, పొగాకు, కూరగాయ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. చేతికొచ్చిన పంట నీట మునిగి, పైరు కుళ్లి ఎందుకు పనికిరాని పరిస్థితి ఏర్పడిందని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారన్నారు. కళ్లాల్లోనూ, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిచి ముద్దవ్వడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారన్నారు. పంట నష్ట పరిహారం చెల్లించి తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే భేషరతుగా కొనుగోలు చేయాలన్నారు. డెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టి ముంపు సమస్య నివారించాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఒ నాగార్జునకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, నేతలు గుత్తుల శ్రీరామచంద్రుడు, నాగిడి రాంబాబు, గుంపుల మోహన్, గుబ్బల గోపీ, కవురు శ్రీను, పొగాకు నారాయణరావు, పొన్నాడ రాము, నోముల కొండ, బూడిద జోగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

నరసాపురంలో నినదిస్తున్న సిపిఎం నేతలు

వీరవాసరం: మిచౌంగ్ తుపాన్ వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహశీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహామూర్తి మాట్లాడుతూ తుపాను వల్ల దెబ్బతిన్న వరి పొలాలను తమ సంఘం నేతలు పరిశీలించారన్నారు. పంట నష్టపోయిన రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఎకరాకు రూ.30 వేలు వరకూ పెట్టుబడులు పెట్టారని, కౌలు చెల్లింపు అదనపు భారంగా ఉందని చెప్పారు. ప్రభుత్వం నష్టం అంచనా వేసి రైతులను తక్షణమే ఆదుకోవాలన్నారు. ఎకరాకు రూ.30 వేలు పరిహారంతోపాటు దాళ్వా సాగుకు ఉచితంగా విత్తనాలు, సబ్సిడీపై ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేయాలని కోరారు. నిబంధనలతో సంబంధం లేకుండా మద్దతు ధరకే తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలన్నారు. ఉద్యాన పంటలకు, తమలపాకు, ఉప్పు, ఆక్వా పంటలకు కూడా నష్టపరిహారం అందించాలన్నారు. డెల్టా ఆధునికీకరణ పనులు వచ్చే వేసవిలో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. మండలంలో సుడిగాలి వల్ల దెబ్బతిన్న బాధితులందరినీ ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో యాళ్లబండి నారాయణమూర్తి, బొర్రా ఆలమహారాజు, బి.సూర్యచంద్రరావు, కేతా జ్యోతిబసు, కేతా సత్యనారాయణ పాల్గొన్నారు.

వీరవాసరం: వినతి అందిస్తున్న నేతలు

కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

డిఆర్‌ఒకు సంయుక్త కిసాన్ మోర్చా వినతి

ప్రజాశక్తి - భీమవరం

రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఈ మేరకు డిఆర్ఒ శ్రీమన్నారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడారు. ఢిల్లీలో రైతు ఉద్యమం 13 నెలలపాటు జరిగిన సమయంలో కేంద్ర ప్రభుత్వం, మోడీ అనేక హామీలు ఇచ్చారన్నారు. గిట్టుబాటు ధర ప్రకటిస్తామని, రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. విద్యుత్ చట్ట సవరణను ఆపాలని, రాష్ట్రపతి జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జుత్తిగ నరసింహామూర్తి, ఆకుల హరేరాం, జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబురావు, జిల్లా సహాయ కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి , తెలుగు రైతు నాయకులు తమ్మినీడి నాగేశ్వరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కిల్లారి తవిటినాయుడు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న రైతు నేతలు

15 గ్రామాలకు 16 శాతం హెచ్‌ఆర్ఎ ఇవ్వాలి

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా కేంద్రం భీమవరం నుంచి 8 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 15 గ్రామాలకు 16 శాతం హెచ్‌ఆర్ఎ ఇవ్వాలని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. భీమవరం పట్టణం, పరిసర ప్రాంతాల్లో 16 శాతం హెచ్‌ఆర్ఎ అమలు అంశంపై భీమవరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అప్పారావుతో ఎంఎల్‌సి ఐవి ఫోన్లో మాట్లాడారు. ఇప్పటికే ఈ అంశానికి సంబంధించిన వివరాలు కమిటీ సభ్యులు కలెక్టరేట్‌కు అందించారని తెలిపారు. ఫైల్ తయారు చేసి ఆర్‌డిఒకు పంపామని, ఒక వారంలో జెసి, కలెక్టర్ అనుమతితో నూతనంగా 15 గ్రామాలకు 16 శాతం హెచ్‌ఆర్ఎ ఇస్తూ ప్రకటన విడుదల చేస్తామని అప్పారావు చెప్పారు.

రూ.90 కోట్లతో పట్టణాభివృద్ధి

ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నామని, రూ.90 కోట్లతో పట్టణాభివృద్ధి చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆయన సోమవారం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత 36వ వార్డు ఎంఆర్ నగర్‌లో రూ.16 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. 37వ వార్డు యాదవుల వారి వీధిలో రూ.40 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి, 34వ వార్డులో పల్లావారి వీధిలో రూ.22 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గ్రంధి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్ల కాలంలో రూ.90 కోట్ల వ్యయంతో భీమవరం పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మరిన్ని అభివృద్ధి పనులు ప్రస్తుతం ఇంకా కొనసాగుతున్నాయన్నారు. వంద పడకల ఆసుపత్రి పనులు వేగవంతంగా సాగుతున్నాయని, యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణ నిమిత్తం రూ.36 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రానున్న 20 రోజుల్లో ఈ పనులకు సంబంధించి టెండర్లను పిలుస్తారన్నారు. ప్రతికూల వాతావరణం వల్ల ఈ నెల 12న భీమవరంలో జరగాల్సిన సిఎం జగన్ పర్యటన రద్దయిందని, ఈ నెల 19న సిఎం పర్యటన ఉండే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమాల్లో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు, మున్సిపల్ ఎంఇ త్రినాధరావు, వైసిపి పట్టణాధ్యక్షులు తోట భోగయ్య, నేతలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

పంటనష్టం నమోదు కౌలురైతుల పేరునే చేయాలి

జెసికి కౌలురైతుసంఘం నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం

పంట నష్టాన్ని కౌలురైతుల పేరునే నమోదు చేసి వాస్తవ సాగుదారులైన కౌలురైతులను తక్షణం ఆదుకోవాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రామాంజనేయులు, కె.సుబ్బరాజు కోరారు. స్థానిక కలెక్టరేట్లో కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డికి తుపాన్ వల్ల నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిచౌంగ్ తుపానుకు, అధిక వర్షాలకు జిల్లాలో నూటికి 70 శాతం పంటలు దెబ్బతిన్నాయన్నారు. జిల్లాలో సాగులో 80 శాతం కౌలురైతులే ఉన్నారని తెలిపారు. ఏ ఆధారమూ లేని కౌలు, పేదరైతులు ప్రయివేటు అప్పులు తెచ్చి పంటలు పండిస్తున్నారన్నారు. తుపాన్ వల్ల పంట ముంపునకు గురై, కళ్లాల్లో ధాన్యం తడిచి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన సిసిఆర్‌సి చట్టం వల్ల కౌలురైతులకు భూయజమానులు కౌలుకార్డులు ఇచ్చేందుకుగాని, పంట నమోదు చేసుకునేందుకుగాని అంగీకరించకపోవడంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పంట నష్టపరిహారం, పంటల బీమా వంటి రాయితీలు కోల్పోయి మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణం వాస్తవ సాగుదారులైన కౌలురైతులను గుర్తించి వారి పేరున పంట నష్టం నమోదు చేసి, పంటల బీమా కల్పించి ఆదుకోవాలని కోరారు.

భీమవరం: వినతి అందిస్తున్న కౌలు రైతు నేతలు

భీమవరం రూరల్: పంట నష్టం కౌలురైతుల పేరునే నమోదు చేసి పంటల బీమా కల్పించి ఆదుకోవాలని కౌలురైతులు సంఘం ఆధ్వర్యంలో తుందుర్రు రైతుభరోసా కేంద్రం అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ మిచౌంగ్ తుపానుకు గ్రామంలో 600 ఎకరాల ఆయకట్టులో 400 ఎకరాలు పైబడి పంట దెబ్బతిందన్నారు. వీరంతా సన్న, చిన్నకారు, కౌలు రైతులని తెలిపారు. ప్రభుత్వం కౌలు రైతులందరినీ గుర్తించి పంటనష్టం, పంటల బీమా వచ్చేలా తగుచర్యలు తీసుకోవాలని, తేమశాతం సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌలురైతులు, రైతులు వలవల నారాయణరావు, జడ్డు పాండురంగారావు, చీడే లవకుమార్, వలవల వెంకటసత్యనారాయణ, దండే ఆశీర్వాదం, అనసూరి శ్రీను పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీలో అదనపు వసూళ్లు తగవు

తహశీల్దార్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకున్న పేదల నుండి అదనంగా డబ్బు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రయివేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందించే ఆరోగ్యశ్రీ సేవలకు డబ్బు వసూలు చేయడం అన్యాయమన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతర పర్యవేక్షణ చేయకపోవడం వల్ల ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. ఆరోగ్యశ్రీలో వివిధ సేవల కోసం ఇస్తున్న ప్యాకేజీ చాలకపోతే కార్పొరేట్, ప్రయివేట్ ఆసుపత్రుల వారు ప్రభుత్వాన్ని అడగాలని సూచించారు. ఆరోగ్యశ్రీలో ఉన్న అన్ని వైద్యసేవలు ఉచితంగా ఉండాలని, వాటికి ఎలాంటి నిబంధనలు ఉండరాదని సూచించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, అడ్డగర్ల అజయకుమారి, సిహెచ్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

రైతులు అధైర్యపడొద్దు: ఎంఎల్‌ఎ చెరుకువాడ

ప్రజాశక్తి - ఆచంట

తుపాన్ ప్రభావంతో నష్టపోయిన కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు అధైర్యపడొద్దని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు అన్నారు. సోమవారం ఆచంటలో నేలనంటిన పంట పొలాలను పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందిస్తామన్నారు. నేలనంటిన ప్రతి ఎకరాకూ ఇన్సూరెన్స్‌తోపాటు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు నష్టపరిహారం అందిస్తామన్నారు. అధికారులు అలసత్వం వహించకుండా పంట నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కోట సరోజిని వెంకటేశ్వరరావు, సుంకర సీతారాం, నేతలు పెచ్చెట్టి సత్యనారాయణ, గురుజుకోట శ్రీనివాస్, మండల విస్తరణాధికారి బి.నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

వరిదుబ్బును పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ చెరుకువాడ

గర్భిణులకు వైద్య పరీక్షలు

గణపవరం:గర్భిణులు, మహిళలు నెలకు నాలుగుసార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలని పిహెచ్‌సి డాక్టర్లు పి.సంతోషనాయుడు, పి.కిరణ్మయి అన్నారు. సోమవారం స్థానిక పిహెచ్‌సిలో జరిగిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. తమ ఆసుపత్రిలో ప్రతినెలా 9, 11 తేదీల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, ఆరోగ్య కార్యకర్తలు ఎం.నల్లయ్య, ఎ.కృష్ణ, ఎ.యోహాను, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి జగన్ మళ్లీ రావాలి : పివిఎల్

ఉండి:రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి మళ్లీ రావాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. సోమవారం యండగండి గ్రామంలో నిర్వహించిన వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న పివిఎల్ నరసింహరాజు డిజిటల్ బోర్డును ఆవిష్కరించి వైసిపి జెండాను ఎగురవేశారు. అనంతరం పివిఎల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి ఒకే ప్రాంతంలో ఏకీకృతం అవ్వకుండా అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా మళ్లీ రావాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ధోకా లేకుండా వారికి మెరుగైన విద్య అందించడమే కాకుండా ఒకేసారి సుమారు రెండు లక్షల ఉద్యోగాలిచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, వైస్ ఎంపిపి దత్తాల సుజాతరాణి, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స అంజనేయరాజు పాల్గొన్నారు.

సుబ్బారావుకు ఘంటసాల అవార్డు

పెనుగొండ:పద్మశ్రీ ఘంటసాల, పద్మశ్రీ ఎన్‌టిఆర్ సంగీత స్మారక కళాపీఠం, కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా పామర్రులో ఘంటసాల 101వ జయంతి సందర్భంగా ఘంటసాల అవార్డును పెనుగొండకు చెందిన చివటం సుబ్బారావుకు అందజేశారు. ఈ సందర్భంగా పెనుగొండకు చెందిన సిహెచ్.త్రిశూల పాణి ఎంపిడిఓ (యలమంచిలి), వి.గోపాలకృష్ణ, కె.ప్రసాద్, వి.బుచ్చిరామయ్య, రఘునాథ ఆచార్యులు, సిహెచ్ శ్రీనివాసరావు, శిరివరపు రామకృష్ణ ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం గాయకులు సుబ్బారావు మాట్లాడుతూ ఘంటసాల పేరున తనకు ఇది రెండో అవార్డు అని, గతంలో రాజమండ్రి కళారత్న వారు మొదటి అవార్డు అందజేశారని తెలిపారు.

ఆర్‌డిఒకు సిపిఐ నేతల వినతి

భీమవరం రూరల్:కొత్త పూసలమర్రు గ్రామంలో గ్రామకంఠం భూమిని పేదవారికి అమ్ముకుని వాళ్లు ఇళ్లు కట్టుకోకుండా, దారి ఇవ్వకుండా దౌర్జన్యం చేస్తున్న గ్రామ పెత్తందారిపై చర్యలు తీసుకుని పేదలకు న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన స్పందనలో బాధితులతో కలిసి సిపిఐ నాయకులు ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

ఆచంట: సెర్ప్ ఉన్నతి మహిళా శక్తి ద్వారా కొడమంచిలి గ్రామానికి చెందిన ఎల్లమెల్లి బేబీ రాజేష్‌కు మంజూరైన ఆటోను ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో గ్రామీణ మహిళలకు ఆటోలు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎపిఎం సతీష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ పాల్గొన్నారు.

మొగదిండి డ్రెయిన్ ప్రక్షాళన పనుల పరిశీలన

కాళ్ల:మొగదిండి డ్రెయిన్ ప్రక్షాళన పనులు ఎంఎల్‌ఎ మంతెన రామరాజు సోమవారం పరిశీలించారు. ఇటీవల తుపాను ప్రభావం వల్ల అధిక వర్షాలు కురవడంతో డెల్టాలోనే రెండు లాగా వరిచేలు మునిగిపోయాయి. మొగదిండి డ్రెయిన్ నీరులాగకపోవడంతో పెదపులేరు, చినపులేరు, సీసలి, జక్కరం, బొండాడపేట, లక్ష్మీ నరసింహపురం గ్రామాల్లో వరి చేలు పూర్తిగా మునిగిపోయాయి. కిక్కిస, గుర్రపుడెక్క, తూడు పేరుకుపోయి వరి, ఆక్వా రైతులు ఈ డ్రెయిన్ నీటిని ఉపయోగించలేకపోతున్నారు. సీసలి నుంచి సత్యనారాయణపురం వరకూ గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టేందుకు రూ.10 లక్షలతో జరుగుతుందన్నారు. రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి నాయకులు చొరవతో మొగదిండి డ్రెయిన్ ప్రక్షాళన చేపట్టడానికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో తాత్కాలిక నిధులతో డ్రెయిన్ ప్రక్షాళన పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి గౌరవాధ్యక్షులు కలిదిండి గోపాలకృష్ణంరాజు, పాతపాటి మురళి రామరాజు, డిసి మాజీ ఛైర్మన్ తోట ఫణిబాబు, మాజీ సర్పంచి వీరవల్లి శ్రీనివాస్, దాసరి రాజు, గుడాల శివనారాయణ, డ్రెయినేజీ ఎఇ లీలా ప్రసన్న పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు ప్రభుత్వ ప్రోత్సాహం

జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి

భీమవరం: ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించడం అభినందనీయమని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. సున్నా వడ్డీకే రుణాలు, ఆటో రిక్షాలు కొనుగోలుతో ఉన్నతి మహిళా శక్తితో సాధికారిత, ఎస్‌సి, ఎస్‌టి మహిళల జీవనోపాధికి మరింత ఊతం సాధ్యమైందన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన లబ్ధిదారులకు సున్నా వడ్డీకే ఆటో రిక్షాలను అందజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కొంతదూరం ఆటోలో ప్రయాణించారు. ఈ జెసి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ఉన్నతి-మహిళాశక్తి అనే ప్రత్యేక పథకం ద్వారా సున్నా వడ్డీకే ఆటో రిక్షాలు అందిస్తోందన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆటో కొనుగోలు సమయంలో లబ్ధిదారులు 10 శాతం వాటా సొమ్మును బ్యాంకులో జమ చేస్తే మిగిలిన 90 శాతం వడ్డీలేని రుణాన్ని అందిస్తున్నారు. జిల్లాలో ఆరుగురు ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు ఈ ఆటోలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జి పిడి వైఎన్‌ఎస్.ప్రసాద్ యాదవ్, డిపిఎం కె.శ్రీనివాస్, జిల్లా ఉన్నతి కోఆర్డినేటర్ బి.రామకృష్ణ, సిసిలు, ఎపిఎంలు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

ఐదుగురికి తీవ్ర గాయాలు

ఉండి : ఆటోను కారు మితిమీరిన వేగంతో ఢీకొనడంతో ఆటోలోని ప్రయాణికులు తీవ్ర గాయాల పాలైన సంఘటన ఉండి మండలంలోని ఎన్‌ఆర్‌పి అగ్రహారంలోని విజయ పాల శీతల కేంద్రం వద్ద చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... ఆకివీడు నుంచి భీమవరం వెళ్తున్న కారు డ్రైవర్ మితిమీరిన వేగంతో వెనుక వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ఢీకొన్నాడు. దీంతో ఆటోలోని నలుగురు ప్రయాణికులు, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు పోలీసులను అప్రమత్తం చేసి క్షతగాత్రులను 108 వాహనంలో భీమవరం ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా పివిఎల్‌ను పలువురు అభినందించారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని పోలీసులను పివిఎల్ కోరారు.

తెలియని నవదంపతుల ఆచూకీ

జువ్వలపాలెంలో విషాదఛాయలు

కాళ్ల:అంతర్వేది బీచ్‌లో ఆదివారం గల్లంతైన నవ దంపతుల ఆచూకీ సోమవారం రాత్రి వరకూ తెలియరాలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. జువ్వలపాలెం గ్రామానికి చెందిన రేలంగి లక్ష్మీనారాయణ (27)కు, ఏలూరు జిల్లా కలిదిండి మండలం గురవాయపాలెం వాసి నాగ గాయత్రికి గత నవంబర్ 1న వివాహం జరిగింది. లక్ష్మీనారాయణ భీమవరంలోని ఓ ప్రయివేటు విద్యాసంస్థలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఆయన భార్యతో కలిసి విహారయాత్రకు అంతర్వేది వెళ్లారు. అక్కడ బీచ్‌లో వారు స్థానానికి దిగగా కెరటాల ఉధృతికి మునిగి గల్లంతయ్యారు. ఇరు కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలించినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు గాలించారు. అయినా వారి జాడ తెలియలేదు. కార్తికమాసం సందర్భంగా అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుంటామని చెప్పి ఇంటి నుండి బయలుదేరి వెళ్లారని, ఈ విధంగా జరుగుతుందని అనుకోలేదని బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. దీంతో జువ్వలపాలెం గ్రామంలో లక్ష్మీనారాయణ ఇంటి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. సఖినేటిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం కూడా వారి ఆచూకీ తెలియలేదు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

రాబోయేది టిడిపి ప్రభుత్వమే : ఎంఎల్ఎ రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని, 2024లో టిడిపి అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు తెలిపారు. జువ్వలపాలెంలో సోమవారం ఎంఎల్ఎ మంతెన రామరాజు భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీలో వాగ్దానాలు తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15,000, ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి స్త్రీకి నెలకు

కరపత్రాలు అందజేస్తున్న ఎంఎల్ఎ రామరాజు

రూ.1500, దీపం పథకం కింద ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు తదితర సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులందరికీ లబ్ధి చేకూరే విధంగా అమలు చేయడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి టిడిపి కట్టుబడి ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామంలో పాదయాత్రగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, గోకరాజు నాగరాజు, మాజీ ఎంపిటిసిలు నడింపల్లి విశ్వనాథరాజు, బొత్స గణేష్, దాసరి దాలినాయుడు పాల్గొన్నారు.

రాయితీలు కౌలు రైతులకు చెందాలి

ప్రజాశక్తి - ఆచంట

ప్రభుత్వం అందించే రాయితీ కౌలు రైతులకు అందించే విధంగా రైతులు సహకరించాలని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి రైతు కమ్యూనిటీ హాల్లో కౌలు రైతులతో సుంకర సీతారామ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ తుపాన్ వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వపరంగా వచ్చే రాయితీలు కౌలు రైతులకు చెందాలని తీర్మానించారు. పంట నష్టపోయిన కౌలు రైతులకు భూయజమానులు సహకరించాలన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డులు అందించే విషయంలో భూ యజమానులు సహకరించాలన్నారు. ఎంఎల్ఎ రంగనాథరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రతి ధాన్యపు గింజా కొనేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, అగ్రికల్చర్ ఎఒ నాగరాజు, విఎఒ నవీన్, ఎంపిటిసి యల్లమెల్లి బేబీ రాజేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పాలకొల్లు

మున్సిపల్ పర్మినెంట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ ఎదుట సోమవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నెక్కంటి సుబ్బారావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 27వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ధనాల శ్రీను, ప్రధాన కార్యదర్శి ధనాల ఏడుకొండలు, ఉపాధ్యక్షులు అల్లం సాయిబాబా, ఆకుల అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముత్యాల రాంబాబు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

మిచౌంగ్ తుపాను బాధితులకు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు 25 కేజీల బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరుకువాడ గ్రామంలోని సుమారు 30 కుటుంబాలు నిరాశ్రయులయ్యారని అధికారులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వారికి ప్రభుత్వపరంగా సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఎంపిటిసి క్రిస్టోఫర్, గ్రామ అధ్యక్షులు కొండవీటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో

విష్ణు విద్యార్థిని వందనకు తృతీయ స్థానం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అంతర్జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విష్ణు మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని పిల్లి వందన 3వ స్థానాన్ని కైవసం చేసుకుంది. మలేషియా దేశ రాజధాని జొహర్ బాహరు నగరంలో 'ఏషియా క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2023' అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 84 కేజీల సబ్-జూనియర్ విభాగంలో కళాశాల విద్యార్థిని పిల్లి వందన తృతీయ స్థానం సాధించింది. దీంతో పాటు ఆమె స్క్వాట్‌లో సిల్వర్ మెడల్, బెంచ్ ప్రెస్‌లో బ్రాంజ్ మెడల్, డెడ్ లిఫ్ట్‌లో బ్రాంజ్ మెడల్, ఓవర్ ఆల్ ఛాంపియన్షిప్‌లో బ్రాంజ్ మెడల్ మొత్తం 4 మెడల్స్ గెలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరాజు తెలిపారు. వందన వెంకటలక్ష్మి, సాయిబాబా దంపతుల రెండో కుమార్తె. ఆమె అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చినందుకు కళాశాల యాజమాన్యం, సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

'మనోహర్ అరెస్టు అప్రజాస్వామికం'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టైకూన్ జంక్షన్‌ను తెరవాలని కోరిన జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు (చినబాబు) విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చినబాబు మాట్లాడుతూ వైజాగ్‌లో ఎంపి సత్యనారాయణ వ్యాపారానికి వాస్తు దోషం ఉందని టైకూన్ జంక్షన్‌ను మూసివేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. నిరసన తెలిపేందుకు వెళ్లిన జనసేన నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. జంక్షన్ ప్రారంభించకపోతే చలో వైజాగ్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిఎసి సభ్యులు కనకరాజు సూరి, పట్టణాధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకర రవి, వీరవాసరం మండల అధ్యక్షులు బాలాజీ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : నాదెండ్ల మనోహర్ అక్రమ అరెస్టును ఖండిస్తూ జనసేన కార్యాలయంలో నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడడానికి వచ్చిన నాయకుడిని అక్రమంగా అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజలు ప్రతీదీ గమనిస్తున్నారన్నారు. మనోహర్‌ను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాతాడి కనకరాజు, గుబ్బల మార్రాజు, తోట నాని, యాదంరెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి - పోడూరు

మిచౌంగ్ తుపాన్ వల్ల పంటలు దెబ్బతిన్న రైతులు, కౌలు రైతులకు వేరుగా పంట నష్టం నమోదు చేసి ఆదుకోవాలని, తేమ శాతం సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ తుపాన్ ప్రభావం వల్ల మండలంలో 70 శాతం పైగా పంటలు దెబ్బతిన్నాయని, రైతులకు నష్టపరిహారం కింద ప్రతి ఎకరాకూ రూ.25,000 చెల్లించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, కంకటాల భాస్కరరావు, కొప్పర్థి నరసింహమూర్తి, కె.కృష్ణారావు, బూరాబత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

పోడూరు : వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

పెనుగొండ : చినమల్లంలో మిచౌంగ్ తుపానుకు నేలనంటిన వరిచేలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తున్న అధికార బృందాన్ని సోమవారం సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పంట చేల వద్ద రైతు భరోసా అధికారి మనోజ్ ను, విఆర్ఒ కెవి సత్యనారాయణతో మాట్లాడారు. జరిగిన నష్టాన్ని కౌలు రైతు పేరున నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు వచ్చిన నష్టాన్ని భూ యజమాని పేరున ప్రభుత్వం నమోదు చేయించడంతో చాలామంది కౌలు రైతులు నష్టపరిహారం పొందలేకపోతున్నారన్నారు. తక్షణం ప్రభుత్వం చిన్న, సన్నకారు, కౌలు రైతులకు మద్దతు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బొక్క పద్మారావు, కృష్ణమూర్తి, పిల్లి రాంబాబు, గుబ్బల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ అలసత్వంతో రైతులకు నష్టం

ప్రజాశక్తి - వీరవాసరం

తుపాను పంట నష్టాన్ని అంచనా వేయించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి విమర్శించారు. టిడిపి, జనసేన నాయకులు సోమవారం పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తుపానుతో పాటు మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడం వల్లే అధిక నష్టం జరిగిందని రైతులు మతల పెద్దబ్బాయి, దూసనపూడి శ్రీనివాసరావు టిడిపి పరిశీలన బృందం పెచ్చెట్టి బాబు, సిహెచ్. రామాంజనేయులు, కె.నాగేంద్రబాబు, దాసరి ఆంజనేయులు దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం పంటను కోసినా మిషన్ ఖర్చులు తప్ప పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉందన్నారు. నష్టపరిహారం పొందిన వారి ధాన్యం కొనుగోలు చేయమని అంటున్నారని అసలు నిబంధనలు ఏంటో తెలియడం లేదని వాపోయారు. అనంతరం టిడిపి, జనసేన నాయకుల ఆధ్వర్యంలో తహశీల్దార్ సుందరాజుకు వినతిపత్రం అందజేశారు. తక్షణం ప్రభుత్వం నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన మండల అధ్యక్షులు కొల్లేపర శ్రీనివాసరావు, జవ్వాది బాలాజీ, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, వైస్ ఎంపిపిలు పాల్గొన్నారు.

పోడూరు : మిచౌంగ్ తుపాన్ రైతులకు తీవ్రనష్టం మిగిల్చిందని, ప్రభుత్వం ఇప్పటి వరకూ నష్ట నివారణ చర్యలు చేపట్టలేదని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం గుమ్మలూరులో తోటమెరక ప్రాంతాల్లో తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన పంట పొలాలను మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ, రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ చంద్రశేషుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అంగర మాట్లాడుతూ తుపాన్ వచ్చి ఐదు రోజులైనా ప్రభుత్వం తరపున పంట నష్టం అంచనా వేసేందుకు ఒక్కరూ రాకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి శేషు, వలవల బాబ్జీ మాట్లాడుతూ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తుపాన్ వల్ల పెద్దగా నష్టం ఏమీ జరగలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, నియోజకవర్గ పరిశీలకులు బోళ్ల సతీష్ బాబు, ఆచంట జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఆచంట : భారీ వర్షాలకు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొడమంచిలిలో టిడిపి ఆధ్వర్యంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతుల నుంచి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వలవల బాబ్జీ, అంగర రామ్మోహన్‌రావు, దాసరి శ్రీను సుందరం, శేషు, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష సిబ్బంది విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

ఎస్‌ఎస్‌ఎలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తక్షణం పర్మినెంట్ చేయాలని ఆ సంఘం నాయకులు చిన్న చంటి అన్నారు. ఎంఇఒ కార్యాలయంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఎస్ఐ కోఆర్డినేటర్, అక్కౌంటెంట్, సిఆర్‌పిలు సోమవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. తమను రెగ్యులర్ చేయాలని, మూడు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, ప్రియాంక, నరేష్, ప్రసాద్, మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

14, 15వ తేదీల్లో ఆశాల ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

ఈ నెల 14, 15 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే 36 గంటల ధర్నా, వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగర్ల అజయకుమారి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు.

ప్రాణాపాయం ఉంది.. రక్షించండి

డిఎస్‌పికి గరగపర్రు ఆత్మగౌరవ ఉద్యమ నాయకులు వెంకటరత్నం వినతి



డిఎస్‌పి శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకటరత్నం

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రు దళితుల సాంఘిక బహిష్కరణ ఘటనకు కారకులైన ఇందుకూరి బలరామ కృష్ణంరాజుతో తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణాపాయం ఉందని, తమకు రక్షణ కల్పించాలని గరగపర్రు ఆత్మగౌరవ ఉద్యమ నాయకులు సిరింగుల వెంకటరత్నం భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్‌ను కోరారు. స్థానిక కలెక్టరేట్లో డిఎస్‌పి శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. 2007లో సాంఘిక బహిష్కరణకు గురికావడం జరిగిందని, దీనిలో బలరాంరాజు కీలకంగా వ్యవహరించారని తెలిపారు. ప్రభుత్వం కేసు నమోదు చేసి దళితులకు రావాల్సిన నష్టపరిహారాన్ని అందించినట్లు తెలిపారు. అయితే బలరాంరాజు కేసు ఉపసంహరించుకోవాలని తనకు రాయబారాలు పంపుతున్నాడని, అంగీకరించకపోవడంతో అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. అలాగే కుటుంబ సభ్యులను సుపారీ ఇచ్చి హతమరుస్తానని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కుటుంబంతో శుభకార్యానికి ఆకివీడు వెళ్లి తిరిగి వస్తుండగా తనపై దాడి చేయించారని ఆరోపించారు. బలరాంరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తనను, కుటుంబ సభ్యులను రక్షించాలని డిఎస్‌పి శ్రీనాథ్‌ను కోరారు.

నరసాపురంలో అన్నదానం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

అంబేద్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెన్నేటి సురేష్ మాదిగ, మాల మహానాడు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర నాయకులు పట్టెం ముత్యాలు ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 6న అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం మిచౌంగ్ తుపాన్ కారణంగా నిలుపుదల చేసి సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షులు సిర్రా రాధాకృష్ణ, యూత్ నాయకులు తెన్నేటి శేఖర్ బాబు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

GUNTUR MURALIDHARA RAO (Old Name), S/o GUNTURU SAMBA SIVARAO, R/O H.No 4-14, Near Panchayat Office, Chataparru - 534004. Changed my name **GUNTUR MURALIDHARA RAO** (Old Name) to **GUNTURU MURALIDHARA RAO** (New Name) for all purposes.
Affidavit No: IN-AP40546293448193V.
Dated 14-11-2023

ప్రార్థనా మందిరం ప్రారంభం

ఆచంట:ప్రతి ఒక్కరూ ఏసు క్రీస్తుకు విశ్వాస పాత్రులుగా నిలవాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంటలో సోమవారం ఆచంట పంచాయతీ పరిధి కాపుల పాలెంలో క్రీస్తు ప్రార్థనా మందిరాన్ని క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఛైర్మన్ మేడిద జాన్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు.

దస్తావేజులు పడిపోయినవి

పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం పట్టణంలోని మెంటేవారి తోటలో నివాసం ఉంటున్న తాను అనగా రామిశెట్టి సురేష్, తండ్రి: నరసింహమూర్తి లకు తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ పరిధిలో 32వ వార్డు కడకట్ల రామిశెట్టి వారి వీధిలోని డోర్ నెంబర్ 1-3-14 లో 332 1/2 చదరపు గజాల ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలమునకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు జిరాక్స్ తీసుకునే నిమిత్తం ఈనెల అనగా 01-12-2023వ తేదీన వన్ టౌన్‌లోని తాలూకా ఆఫీస్ ఏరియాకు మోటార్ సైకిల్‌పై వస్తుండగా మధ్యలో జారిపడిపోయినవి. కావున దయచేసిన దొరికినవారు ఈక్రింది సెల్ నెంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు

సెల్: 9347630225

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ అయిన శ్రీమతి సిద్ధనాతి రాజ్యలక్ష్మి, W/o. సిద్ధనాతి వెంకట సూర్య సాంబశివరావు, శాంతినగర్, ఏలూరు, ఏలూరు జిల్లా అను వారు ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని శ్రీమతి వీరమళ్ళ బిందు, W/o. హనుమంతరావు, రావికంపాడు గ్రామం, కామవరపుకోట మండలం, ఏలూరు జిల్లా గ్రామ కాపురస్థులు అను వారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు సిద్ధపడినారు. సదరు ఆస్తి కొనుగోలు విషయంలో ఎటువంటి లావాదేవీలు ఉన్న యెడల నా యొక్క దిగువ అడ్రసుకు నేటి నుండి 7 రోజులలో సంప్రదించవలసినదిగా కోరుచున్నాను. తదనంతరం ఎటువంటి లావాదేవీలకు నా క్లయింటు బాధ్యులు కాదు అని ఈ పత్రికా ముఖముగా తెలియచేయుచున్నాను.

షెడ్యూల్ ఆస్తి వివరము

ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్, పాత ప॥గో॥జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, గుర్వాయిగూడెం గ్రామపంచాయతీ, రి.స. నెం. 49 రు దాఖలా తాలూకా డాక్యుమెంట్ నెం. 2650/2020 జాయింట్ సబ్ రిజిష్ట్రీ, జంగారెడ్డిగూడెం చ॥గ॥ 231 స్థలం ఆస్తికి హద్దులు.
తూర్పు: చ॥గ॥లు 11లు ఆర్అండ్‌బి రోడ్డు.
దక్షిణం: గ॥ 18లు దల్లి చంద్రశేఖరరెడ్డి గారి స్థలం.
పడమర: గ॥ 11లు దల్లి చంద్రశేఖరరెడ్డి గారి స్థలం.
ఉత్తరం: గ॥ 24లు చిటికిన సత్యనారాయణ గారి స్థలం.

అంబుల వెంకట నారాయణ
ఏలూరు — న్యాయవాది, ఏలూరు
తేది: 11-12-2023 — సెల్: 9848422155

In the Court of the Hon'ble Addl. Senior Civil Judge, Eluru
E.A. No. 307/2023 in
E.A. No. 342/2018 in
E.P. No. 28/2017 in
O.S. No. 281/2007

Between:
1. Gullapudi Dhananjaya Rao (died)
2. Gullapudi Syamala and Others

...Petitioners/ D.Hrs

AND

Rayee Vimala @ Vimala Devi and Others

...Respondents/ JDr/ Proposed Respondents

To:
R-2: Gajavali Venkateswara Rao, S/o. Subba Rao, D.No. 4-21, Subbammadevi School Road, Eluru, Eluru District.

పై నెంబరు పిటీషనులో శ్రీ కోర్టు వారు 2వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం పలుమార్లు నోటీసులు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీయొక్క హాజరు నిమిత్తం **ది. 15-12-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాని యెడల మీ పరోక్షమున పై నెంబరు పిటీషను పరిష్కరింపబడునని తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

G.V.ANAND KUMAR, Advocate
Eluru, Cell: 9848427001

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 110/1997

వాదు: 1. రేమణి సత్యవతి (died)
2. మధిర వెంకట చంద్రశేఖర్
(2nd Plaintiff added at LR of Deceased 1st Plaintiff as Pr. Order in I.A. No. 983/2014, dated: 25-11-2022)
ప్రతివాదు: సామంచి అనే రేమణి కృష్ణవేణ వగైరా

పై నంబరు దావాలో ప్రతివాద్లు 12 రేమణి సీతామహాలక్ష్మి, W/o. వెంకట సుబ్రహ్మణ్యశర్మ, 13. రేమణి జగన్నాథం, S/o. వెంకట సుబ్రహ్మణ్య శర్మ, 14. రేమణి శ్రీనివాసు, S/o. వెంకట సుబ్రహ్మణ్య శర్మ, డోర్ నెం. 27-7-1, గుండువారి పేట, భీమవరం, Bhimavaram SCJC అనువారికి దావా సమనులు కోర్టు ద్వారాన్ను, రిజిష్టరు పోస్టు ద్వారాను అమలు జరగనందున Substituted సర్వీసు ద్వారా అమలు జరుపుటకుగాను **ది. 18-12-2023వ సం॥రం తేదీకి వాయిదా వేసినారు.** కావున 12, 13, 14 ప్రతివాద్లు సదరు వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేని యెడల 12, 13, 14 ప్రతివాద్లు పరోక్షమందు పై దావా తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

కాళ్ళకూరి కుసుమ హరనాథ్
అడ్వకేట్, తాడేపల్లిగూడెం
సెల్: 9963954564

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
హెచ్.యమ్.ఒ.పి. నెం. 88/2023

Between:
గంటా @ వలవల శైలూష — **-పిటీషనర్**
మరియు
గంటా వెంకటేశ్వరరావు — **-రెస్పాండెంటు**

రెస్పాండెంటు: గంటా వెంకటేశ్వరరావు, తండ్రి: సంహాద్రి, కంద్రిగ, H/o. పాందువ్వ, ఉండి మండలం, పశ్చిమగోదావరి జిల్లా, సెల్: 9491171876.

పై నెంబరు కేసులో (H.M.O.P. No. 88/2023) పై కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినప్పటికి మీరు ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకోనందున శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారము ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు కేసు **ది. 28-12-2023వ తేదీ వాయిదా అయి ఉన్నది.** కావున మీరు ఖుద్దున కాని, మీ యొక్క న్యాయవాది గారి ద్వారా గాని సదరు వాయిదా రోజు (కోర్టుకు) **ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయితూ హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును అని మీకు ఈ పత్రికా ముఖముగా తెలియజేయడమైనది.

యమ్.గోపాలరావు, అడ్వకేట్
తాడేపల్లిగూడెం — తాడేపల్లిగూడెం
ది.08-12-2023 — సెల్: 9490648497